క్లుప్తంగా

అష్టలక్ష్మి అలంకారంలో పెద్దమ్మతల్లి



అష్టలక్ష్మి అలంకారంలో పెద్దమ్మ తల్లి

మైదుకూరు : పట్టణంలోని పెద్దమ్మతల్లి 24వ ప్రతిష్ట వార్షికోత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయం అమ్మవారికి విశేష అభిషేకాలు, అర్చనలు చేశారు. పెద్దమ్మ తల్లి అష్టలక్ష్మిదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

ఘనంగా పెద్దమ్మ తల్లి వార్షికోత్సవం



ప్రత్యేక అంకరణలో పెద్దమ్మ తల్లి

ప్రొద్దుటూరు : మండల పరిధిలోని తాళ్లమాపురం గ్రామంలో పెద్దమ్మతల్లి వార్షికోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. చీమల మురళీకృష్ణ ప్రసాద్‌రెడ్డి, పవన్‌కుమార్ రెడ్డి, రాజమోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈ ఉత్సవాలను నిర్వహించారు. అర్చకుడు పవన్‌కుమార్ శర్మ ఆధ్వర్యంలో ఉదయం అమ్మవారికి విశేష అభిషేకాలు, అర్చనలు చేసి సుందరంగా అలంకరించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

సంచుల తయారీ మహిళలకు ఉపయుక్తం



మాట్లాడుతున్న ఎంపీడీఓ కుళ్లాయమ్మ

మైదుకూరు : కాలుష్య రహిత సంచుల తయారీ మహిళలకు ఎంతో ఉపయుక్తమని ఎంపీడీఓ కె.కుళ్లాయమ్మ అన్నారు. పట్టణంలోని కేసీ నగర్‌లో పర్యావరణ హితమైన సంచుల తయారీలో మహిళలకు ఇస్తున్న శిక్షణ సోమవారం ముగిసింది. ప్రగతి దివ్యాంగుల సంక్షేమ అభివృద్ధి సంస్థ, నాబార్డు సహాయంతో 15 రోజులపాటు శిక్షణ ఇచ్చింది. ముగింపు సమావేశంలో ఎంపీడీఓ మాట్లాడుతూ సంచుల తయారీతో మహిళలకు ఉపాధితోపాటు పర్యావరణానికి మేలు జరుగుతుందని తెలిపారు. సమావేశంలో భారతీయ స్టేట్ బ్యాంకు మేనేజర్ హసీనా బేగం, ప్రగతి సంస్థ ప్రతినిధి జగజ్జీవన్ పాల్గొన్నారు.

రక్తదానం



రక్తం ఇస్తున్న వెంకట్

పోరుమామిళ్ల : బ్రహ్మంగారిమఠం మండలం వెంకటాపురానికి చెందిన విద్యార్థిని శివకుమారి అనారోగ్యం బారిన పడడంతో తల్లిదండ్రులు పోరుమామిళ్లలో ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించారు. వైద్యులు రక్తం కావాలని చెప్పడంతో వారు రైట్ హ్యాండ్ చారిటబుల్ ట్రస్టును ఆశ్రయించారు. సోమవారం ట్రస్టు వ్యవస్థాపకులు రసూల్ స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల సివిక్స్ లెక్చరర్ వెంకట్ ద్వారా రక్తం ఇప్పించి విద్యార్థినిని ఆదుకున్నారు. 9వ సారి రక్తం ఇచ్చిన వెంకట్‌ను అందరూ అభినందించారు.

కొనిరెడ్డి ఫౌండేషన్ సేవలు అభినందనీయం

ప్రొద్దుటూరు కల్చరల్ : కొనిరెడ్డి ఫౌండేషన్ సేవలు అభినందనీయమని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి పేర్కొన్నారు. స్థానిక కొర్రపాడు రోడ్డులోని కొనిరెడ్డి ఫౌండేషన్ కార్యాలయంలో రూ.10లకే భోజనం ప్రారంభించి ఏడాది అయిన సందర్భంగా వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేక్ కట్ చేసి పంచారు. ప్రముఖ అవధాని నరాల రామారెడ్డి , ఫౌండేషన్ అధ్యక్షుడు కొనిరెడ్డి శివచంద్రారెడ్డి, కొనిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నేడు సచివాలయ కన్వీనర్లు, గృహ సారథుల సమావేశం

దువ్వూరు : మండల కేంద్రమైన దువ్వూరులోని దేవాన్ష్ కల్యాణ మండపంలో మంగళవారం ఉదయం 9.30 గంటలకు సచివాలయాల కన్వీనర్లు, గృహ సారథులతో సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ కానాల జయచంద్రారెడ్డి సోమవారం తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి పాల్గొంటారని, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు హాజరుకావాలని కోరారు

అభివృద్ధి పనులకు భూమిపూజ



భూమి పూజ కార్యక్రమంలో ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

ప్రొద్దుటూరు : మున్సిపల్ నిధులు రూ.60లక్షలతో చేపడుతున్న కొర్రపాడు రోడ్డులోని ఈద్గా అభివృద్ధి పనులకు సోమవారం ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్ రెడ్డి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రంజాన్ పండుగ నాటికి అభివృద్ధి పనులు పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టామన్నారు. చాలా రోజులుగా ఈద్గా సమస్యలపై వైఎస్సార్‌సీపీ ముస్లిం కౌన్సిలర్లు, నాయకులు కోరుతున్నారన్నారు. వారి కోరిక మేరకు నిధులు మంజూరు చేశామన్నారు. ముఖ్యమంత్రి జగన్ అభివృద్ధి పనులకు రూ.600 కోట్లు నిధులు మంజూరు చేయడంతో నూతన మార్కెట్, పెన్నానదిపై హైలెవెల్ బ్రిడ్జి, ఆర్టీసీ బస్టాండ్ ఆధునీకరణ, వైఎస్సార్ ఇంజనీరింగ్ కాలేజీ అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. జిల్లా ప్రభుత్వాస్పత్రికి టెండర్లు జరగాల్సి ఉందని, ఎస్‌సీఎస్‌ఆర్ ఆర్ట్స్‌కాలేజీ నిర్మాణ పనులు చేపట్టాల్సి ఉందన్నారు. మురుగునీటి కాలువల ఆధునీకరణ, తాగునీటి పనులను త్వరలో ప్రారంభించాల్సి ఉందన్నారు. వెల్లాల సంజీవరాయ స్వామి ఆలయ పునఃనిర్మాణానికి రూ.5.80 కోట్లు మంజూరయ్యాయని, రామేశ్వరం ఆలయాల అభివృద్ధికి త్వరలో రూ.7 కోట్లు నిధులు మంజూరవుతాయన్నారు. క్రైస్తవులకు శ్మశాన వాటిక కోసం భూమి కొనుగోలు చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

■ స్థానిక 10వ వార్డులోని పాండురంగస్వామి ఆలయం వద్ద రూ.63 లక్షలతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి సోమవారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ గరిశపాటి లక్ష్మీదేవి మాట్లాడుతూ రూ.23లక్షలు మున్సిపల్ నిధులతోపాటు రూ.40 లక్షల గడపగడపకు మన ప్రభుత్వం నిధులతో రోడ్లు, డ్రైనేజీ కాలువలు నిర్మిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ నాగేశ్వరరెడ్డి, ఆప్టికల్స్ రాజా, బీవీఎస్ సుభాష్, వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు కామిశెట్టి బాబు, 11వ వార్డు ఇన్‌చార్జి కసిరెడ్డి మహేష్‌రెడ్డి, శ్రీనివాసులరెడ్డి పాల్గొన్నారు.

టీడీపీ నేతలు విష ప్రచారం చేస్తున్నారు

జరిగిన అభివృద్ధిని చూసి ఓర్చుకోలేని టీడీపీ నాయకులు ప్రొద్దుటూరుకు మచ్చ తెచ్చేలా విష ప్రచారం చేస్తున్నారని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి తెలిపారు. అభివృద్ధికి సంబంధించి కళ్లుండి చూడలేని ధ్రుతరాష్ట్రునిలా వ్యవహరిస్తున్నరని పేర్కొన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి నాగరాజు, అంజుమన్ కమిటీ అధ్యక్షుడు కొవ్వూరు బాషా, సహాయ కార్యదర్శి ఆర్టీసీ బాబా, కమిటీ సభ్యులు దర్గా హనీఫ్, మార్కెట్ ఖాసీం, మహమ్మద్, టైలర్ సత్తార్, టైలర్ మహమ్మద్, మోతిన్‌సాబ్, జహరుద్దీన్‌సాబ్, వడ్ల దాదాపీర్, ఫరీద్, మార్కెట్ దాదాపీర్, జాఫర్, కౌన్సిలర్ గరిశపాటి లక్ష్మీదేవి, వైఎస్సార్‌సీపీ అదనపు కార్యదర్శి పోరెడ్డి నరసింహారెడ్డి, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, వార్డు ఇన్‌చార్జిలు పాల్గొన్నారు.

200వ రోజుకు చేరిన గడపగడపకు మన ప్రభుత్వం



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

ప్రొద్దుటూరు : ప్రభుత్వ ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ప్రొద్దుటూరు నియోజకవర్గంలో త్వరలో ముగియనుందని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి తెలిపారు. కొత్తపల్లె పంచాయతీలోని ప్రకాష్‌నగర్‌లో సోమవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం 200వ రోజుకు చేరుకున్న సందర్భంగా పార్టీ నాయకులు కేక్ కట్ చేసి ఎమ్మెల్యేకు తినిపించారుఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ కార్యక్రమ నిర్వహణలో రాష్ట్ర వ్యాప్తంగా పోల్చితే మనమే ముందున్నామన్నారు. ఎమ్మెల్యే గడపగడపకు తిరిగి సంక్షేమ పథకాలుకు సంబంధించిన బుక్‌లెట్లను లబ్ధిదారులకు అందించారు. ప్రకాష్‌నగర్‌లోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల నిర్వహణ చాలా బాగుందని పేర్కొన్నారు. విద్యాబోధనపై ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. సర్పంచ్ కొనిరెడ్డి శివచంద్రారెడ్డి, ఆప్కాబ్ చైర్‌పర్సన్ మల్లేల ఝాన్సీరాణి రాజారాంరెడ్డి, ఎంపీపీ సానబోయిన శేఖర్‌యాదవ్, ఎంపీటీసీ బాలాజీ నివాస్, పూసల కార్పొరేషన్ డైరెక్టర్ తుపాకుల వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

నేడు ప్రకాష్ నగర్‌లో..

మండలంలోని కొత్తపల్లె గ్రామ పంచాయతీ ప్రకాష్ నగర్‌లో మంగళవారం ఉదయం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మార్తల ఓబుళరెడ్డి తెలిపారు.

గృహసారథులే పార్టీకి పునాదులు

ఎమ్మెల్సీ డీసీగోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధ



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి

బి.కోడూరు : పార్టీకి పునాదులు గృహసారథులే అని ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధ, నియోజకవర్గ పరిశీలకులు ఎస్.వి.జగన్‌మోహన్‌రెడ్డిలు తెలిపారు. సోమవారం మండలంలోని దంతెలపల్లె గ్రామ సమీపాన గల ఫంక్షన్ హాలులో గృహసారథుల శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సభాధ్యక్షులుగా వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రామకృష్ణారెడ్డి వ్యవహరించారు. ముఖ్య అతిథులుగా ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధ, నియోజకవర్గ పరిశీలకులు ఎస్.వి.జగన్‌మోహన్‌రెడ్డిలు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు పార్టీ పటిష్టతకు సైనికుల్లా పనిచేయాలని తెలిపారు. ప్రభుత్వ పథకాల లబ్ది, వైఎస్సార్‌సీపీ విధి విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లి చైతన్యం చేయాలన్నారు. కష్టపడి పనిచేసే వారికి తగిన గుర్తింపు ఉంటుందన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ దావీదు, ఎంపీపీ కోడూరు చెన్నమ్మ, మండల ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్ రెడ్డి, సచివాలయ మండల కన్వీనర్ పి.నరసింహా రెడ్డి, రాష్ట్ర పంచాయతీరాజ్ రూరల్ డెవలప్‌మెంట్ సలహాదారు నాగార్జునరెడ్డి, వైఎస్సార్‌సీపీ మాజీ మండల కన్వీనర్ యోగానందరెడ్డి, మాజీ సర్పంచ్‌లు దుగ్గిరెడ్డి, లక్ష్మీనరసా రెడ్డి, తిరుపతి రెడ్డి, సర్పంచ్ జయరామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు పిచ్చిరెడ్డి, సుబ్బిరెడ్డి, పాపయ్య, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారం కోసమే స్పందన

గోపవరం : ప్రజా సమస్యల పరిష్కారం కోసమే స్పందన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు మండల ప్రత్యేకాధికారి ఎం.నాగరాజ, తహసీల్దారు దామోదర్‌రెడ్డిలు అన్నారు. సోమవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో అన్నిశాఖల అధికారులతో కలిసి వారు స్పందన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎలాంటి సమస్యలైనా స్పందన కార్యక్రమంలో అర్జీల రూపంలో ఇచ్చి పరిష్కరించుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఎంపీడీఓ హరినారాయణ, ఎంఈఓ చెన్నయ్య, సీహెచ్‌ఓ గౌస్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రీలక్ష్మి, పీఆర్ ఏఈ చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీఆర్పీఎస్ అధ్యక్షుడిగా చంద్రబాబు



ప్రొద్దుటూరు కల్చరల్ : పట్టణానికి చెందిన యర్రగుడి చంద్రబాబును సోమవారం విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన ఎస్సీ రైట్ ప్రొటెక్షన్ సొసైటీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా దేవదానం, ఏసన్న, ప్రధాన కార్యదర్శి రమేష్, కార్యదర్శులుగా శేఖర్, రాంబాబు, కోశాధికారిగా ఓబులేసు, ఆర్గనైజింగ్ సెక్రటరీగా డేవిడ్‌రాజు తదితరులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ దళితుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు.

ఆసుపత్రిని అభివృద్ధి పథంలో నడపండి

పీహెచ్‌సీ చైర్మన్, ఎంపీపీ తెలిదేల లక్షుమయ్య



మాట్లాడుతున్న ఎంపీపీ లక్షుమయ్య

చాపాడు : మండల ప్రాథమిక కేంద్రం ఆసుపత్రిని అభివృద్ధి పథంలో నడిచేలా చర్యలు వైద్య సేవలు అందించాలని ఎంపీపీ తెలిదేల లక్షుమయ్య పేర్కొన్నారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్యం కేంద్రంలో సోమవారం ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్, ఎంపీపీ లక్షుమయ్య మాట్లాడుతూ.. ఆసుపత్రికి వచ్చే రోగులకు అన్ని రకాలైన వసతులను కల్పించాలని, గర్భిణులకు సంబంధించిన మందులు, ఫెసిలిటి కిట్‌లను అందుబాటులో ఉండాలన్నారు. రిజిస్టర్ల నిర్వహణ పక్కాగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి రాజేష్‌కుమార్ ఆసుపత్రి అభివృద్ధికి అవసరమైన ఏర్పాట్లపై కమిటీ సమావేశంలో చర్చిస్తామన్నారు. ఇన్‌ఛార్జీ ఎంపీడీఓ రాధా కృష్ణవేణి, ఎంపీటీసీ అస్మా తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ ఆర్‌ఐ సబ్దర్ హఠాన్మరణం



మున్సిపల్ ఆర్‌ఐ సబ్దర్ (ఫైల్)

ప్రొద్దుటూరు : ప్రొద్దుటూరు మున్సిపల్ కార్యాలయంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న సబ్దర్ (50) సోమవారం సాయంత్రం మృతిచెందారు. అనారోగ్యంగా ఉన్న ఆయన సోమవారం మధ్యాహ్నం నెల్లూరులోని ఆస్పత్రికి వెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందారు. మున్సిపల్ కార్యాలయం వెనుక నివాసం ఉంటున్న ఈయనకు కుమారుడు, భార్య ఉన్నారు. ఆర్‌ఐ మృతి పట్ల ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి, వైస్ చైర్మన్ పాతకోట బంగారు మునిరెడ్డి, మున్సిపల్ కమిషనర్ వెంకటరమణయ్య, ఉద్యోగులు సంతాపం తెలిపారు.

వైఎస్సార్‌సీపీ నేతల సంబరాలు



సంబరాలు చేసుకుంటున్న వైఎస్సార్‌సీపీ నేతలు

రాజుపాళెం : ప్రొద్దుటూరు నియోజకవర్గంలో గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమం 200 రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా సోమవారం సాయంత్రం వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గుద్దేటి రాజారాంరెడ్డి ఆధ్వర్యంలో రాజుపాళెంలో సంబరాలు చేసుకున్నారు. ఇన్‌చార్జి ఎంపీపీ ఎస్‌ఏ నారాయణ రెడ్డి మాట్లాడుతూ గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించడంలో ప్రొద్దుటూరు ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలిచారన్నారు. అనంతరం కేక్ కట్ చేసి అందరికి పంపిణీ చేశారు. సచివాలయ మండల కన్వీనర్ శేఖర్‌రెడ్డి, సర్పంచ్‌లు గోవర్ధన్ రెడ్డి, షాజియ తదితరులు పాల్గొన్నారు.

నిబంధనల ప్రకారం మద్యం విక్రయించాలి

పోరుమామిళ్ల: పట్టణంలో ఇటీవల ప్రారంభించిన రిలాక్స్ బార్ రెస్టారెంట్‌లో ఉదయం 6 గంటల నుండే మద్యం అమ్మకాలు చేస్తుండటంతో స్థానికుల నుండి తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం మయ్యాయి. తెల్లారకముందే మద్యం దుకాణం తెరవడం సరికాదని, ఎక్సైజ్, పోలీస్ శాఖలు ఎందుకు పట్టించుకోవడం లేదని స్థానికులు ప్రశ్నించడాన్ని గమనించిన సర్పంచ్ రవిప్రకాష్‌రెడ్డి, జడ్పీటీసీ ముత్యాల ప్రసాద్ సోమవారం వెళ్లి బార్ యాజమాన్యాన్ని నిలదీశారు. నిబంధనల మేరకే బార్ పని చేయాలని, ఇష్టారాజ్యంగా నిర్వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

పంట నమోదు తప్పనిసరి

గోపవరం : రబీలో సాగు చేసిన వివిధ పంటలకు పంట నమోదు చేయించుకోవాలని బద్వేలు ఏడీఏ ఎం.నాగరాజ, వ్యవసాయాధికారి అరవిందనాయక్‌లు తెలిపారు. సోమవారం చిన్నగోపవరంలో జరుగుతున్న పంట నమోదు కార్యక్రమాన్ని వారు ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. పంట నమోదు చేసుకోవడంలో రైతులు కూడా బాధ్యతాయుతంగా ఉండాలన్నారు.

ముఖహాజరు నుంచి మినహాయింపు ఇవ్వండి

కలసపాడు : ముఖహాజరు నుండి మినహాయింపు ఇవ్వాలని సోమవారం తహసీల్దారు రవిశంకర్‌కు గ్రామ రెవెన్యూ సహాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వీఆర్‌ఏలు మాట్లాడుతూ గ్రామసేవకులమైన మేము చాలీచాలని వేతనాలతో కుటుంబాలను నెట్టుకొస్తున్నామని, ముఖహాజరు వలన ఉదయం సాయంత్రం తమ గ్రామాల నుండి మండల కేంద్రాలకు వెళ్ళాలంటే తమకు వచ్చే జీతం బస్సు ఛార్జీలకు కూడా సరిపోదని, ముఖహాజరు నుండి మినహాయింపు ఇవ్వాలని కోరారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్ళాలని తహసీల్దారును కోరారు. కార్యక్రమంలో వీఆర్‌ఏలు సి.హెచ్.కె.స్టీవెన్, గిరి, ప్రభాకర్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

సన్మానం

ప్రొద్దుటూరు : సీఎస్‌ఐ నంద్యాల డయాసిస్ ట్రెజరర్ కొత్తమాసి జోసెఫ్, ప్రమీల దేవి దంపతులు స్థానిక ఎస్పీజీ-1 చర్చి వార్షికోత్సవం సందర్భంగా సోమవారం ఇక్కడికి వచ్చారు. వార్షికోత్సవ వేడుకల్లో పాల్గొన్న అనంతరం చర్చి కమిటీ సభ్యులు గోనా జ్యోతి సురేష్‌కుమార్‌తోపాటు డీనరీ చైర్మన్ అబ్రహం ప్రేమ్ చంద్, కమిటీసభ్యులు వారిని సన్మానించారు.

వెల్లాల ఆలయ అభివృద్ధికి నిధులు మంజూరు



వెల్లాలలో చెన్నకేశవ, సంజీవరాయ, భీమలింగేశ్వరస్వామి ఆలయం

ప్రొద్దుటూరు : ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన రాజుపాళెం మండలంలోని చెన్నకేశవ, సంజీవరాయ, భీమలింగేశ్వరస్వామి ఆలయాల పునఃనిర్మాణానికి రూ.2.90 కోట్లు మంజూరు చేస్తూ దేవదాయశాఖ కమిషనర్ డాక్టర్ ఎం.హరిజవహర్‌లాల్ గత శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లాలో ప్రసిద్ధిగాంచిన ఆలయాల్లో వెల్లాల ఆలయం ఒకటిగా ఉంది. ఆలయ ప్రాశస్త్యాన్ని గుర్తించిన ఎమ్మెల్యే ఈ విషయంపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో మాట్లాడి నిధులు మంజూరు చేయించారు. తొలి విడతగా రూ.2.90 కోట్లు మంజూరయ్యాయని, రెండో విడతగా మళ్లీ రూ.2.90 కోట్లు మంజూరు చేస్తుందని, మొత్తం రూ.5.90 కోట్లతో ఆలయానికి నూతన శోభను సంతరించుకోనుంది.

ప్రజలతో మమేకం కావాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధ

బద్వేలు అర్బన్ : వచ్చే అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ఇప్పటి నుంచే ప్రజలతో మమేకమై రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలతో పాటు ప్రభుత్వం చేసిన మంచిని ప్రజలకు వివరించాలని ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధ, నియోజకవర్గ పరిశీలకులు ఎస్.వి.జగన్‌మోహన్‌రెడ్డిలు పేర్కొన్నారు. సోమవారం మండల పరిధిలోని బయనపల్లెలో గల బొజ్జిరెడ్డి ఫంక్షన్ హాలులో సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, వలంటీర్లతో మా నమ్మకం నువ్వే జగనన్న పేరుతో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో అందుతున్న పథకాలు, ప్రస్తుత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అందుతున్న పథకాల మధ్య తేడాలను ప్రజలకు వివరించి వారిని చైతన్యపరచాలన్నారు.

ఎమ్మెల్సీ అభ్యర్థి విజయానికి కృషి చేయండి

త్వరలో జరగనున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా బరిలో ఉన్న వెన్నపూస రవీంద్రారెడ్డి విజయానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని వారు పిలుపునిచ్చారు. తొలుత మహానేత వైఎస్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ చిన్నపోలిరెడ్డి, మాజీ ఎంపీపీ వెంకటేశ్వర్‌రెడ్డి, మండల కన్వీనర్లు రామసుబ్బారెడ్డి, మల్లేశ్వర్‌రెడ్డి, సచివాలయ మండల కన్వీనర్ శ్రీకాంత్‌రెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షులు శేఖర్‌రెడ్డి, ఆయా పంచాయతీల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పంచాయతీ ఇన్‌చార్జిలు పాల్గొన్నారు.

రైతు సంఘాలను ప్రోత్సహించాలి



ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పిస్తున్న మండల ప్రత్యేకాధికారి నాగరాజ

గోపవరం : ప్రకృతి వ్యవసాయం చేపట్టేందుకు రైతు సంఘాలను ప్రోత్సహించాలని మండల ప్రత్యేకాధికారి ఎం.నాగరాజ పేర్కొన్నారు. సోమవారం గోపవరంలో ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రకృతి వ్యవసాయాన్ని ప్రతిష్టాత్మకంగా చేపట్టి అందుకు సంబంధించిన నిధులు కూడా కేటాయించడం జరిగిందన్నారు. ప్రకృతి వ్యవసాయ సిబ్బంది రైతులతో మమేకమై వారికి అవగాహన కల్పించాలన్నారు. అవసరమైన కషాయాలను తయారు చేయడం, సహజ, మిత్ర పురుగులను పెంపొందించడం, తక్కువ పెట్టుబడితో సూక్ష్మ పంటలకు హాని కలిగించే పురుగులను నివారించడం తదితర అంశాలను వివరించాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి అరవిందనాయక్, ప్రకృతి వ్యవసాయ, ఆర్బీకే సిబ్బంది పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి



మాట్లాడుతున్న నరసింహ శర్మ



మాట్లాడుతున్న తహసీల్దార్ రమాకుమారి

చాపాడు : ఈ నెల 11న మైదుకూరు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఆవరణలో ఈ నెల నిర్వహిస్తున్న జాతీయ లోక్ అదాలత్ సద్వినియోగం చేసుకోవాలని పబ్లిక్ ప్రాసిక్యూటర్ జ్వాలా నరసింహాశర్మ పేర్కొన్నారు. స్థానిక మండల రెవెన్యూ కార్యాలయం వద్ద సోమవారం తహసీల్దారు సుభానీ ఆధ్వర్యంలో జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెవెన్యూ, భూ సమస్యలు పరిష్కరించుకునేలా రెవెన్యూ సిబ్బందికి అవగాహన కల్పించారు. ఇదే క్రమంలో అనేక రకాలైన కేసుల్లో నమోదైన కేసుల్లో రాజీ పడటమే ఉత్తమమైన మార్గమని సూచించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

దువ్వూరులో..

దువ్వూరు : లోక్ అదాలత్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ రమాకుమారి తెలిపారు. దువ్వూరు తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ఆమె మాట్లాడుతూ ఈనెల 11న మైదుకూరు కోర్టులో లోక్ అదాలత్‌ను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాజీకాబడు కేసులన్నీ ఆ రోజు పరిష్కరించుకోవచ్చునని సూచించారు. రాజీ మార్గం రాజమార్గమని, లోక్ అదాలత్‌పై ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ జగదీశ్వరరెడ్డి, ఏపీపీ జ్వాలా నరసింహాశర్మ, పాల్గొన్నారు.

కుష్టువ్యాధి నిర్మూలనపై అవగాహన



కుష్టువ్యాధి నిర్మూలనపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్ఓ ఖాదర్‌వల్లి

గోపవరం : కుష్టువ్యాధి నిర్మూలనపై సోమవారం డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ ఎస్.ఖాదర్‌వల్లి ప్రజలకు, విద్యార్థులకు అవగాహన కల్పించారు. సోమవారం మండలంలోని పి.పి.కుంట ప్రాథమికోన్నత పాఠశాలలో కుష్టువ్యాధిపై అవగాహన సదస్సు నిర్వహించారు. కుష్టువ్యాధి లక్షణాలు, వ్యాధి రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. అనంతరం గర్భవతులతో మాట్లాడుతూ కష్టతరమైన కాన్పుల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలను వారికి వివరించారు. ప్రతి నెల స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గర్భవతులకు ప్రత్యేక పరీక్షలు నిర్వహిస్తున్నారని, ఎక్కడ ఎలాంటి సమస్యలు ఉన్నా వైద్యులకు తెలియజేసి వారి ద్వారా మెరుగైన వైద్యం చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ శివరామిరెడ్డి, సీహెచ్‌ఓ గౌస్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పది ఉత్తీర్ణతా శాతాన్ని పెంచండి



మాట్లాడుతున్న డిప్యూటీ డీఈఓ రాజగోపాల్‌రెడ్డి

మైదుకూరు : పదో తరగతి పరీక్షల్లో ఉత్తీర్ణతా శాతాన్ని పెంచేందుకు కృషి చేయాలని డిప్యూటీ డీఈఓ రాజగోపాల్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆయన మండలంలోని జీవీ సత్రం హైస్కూల్‌లో ఉపాధ్యాయులతో మాట్లాడారు. రికార్డులను, ఎఫ్ఏ పరీక్షల మూల్యాంకణాన్ని పరిశీలించారు. బాధ్యతతో పనిచేసి విద్యార్థులకు మంచి భవిష్యత్తునివ్వాలని సూచించారు. పదో తరగతి విద్యార్థులతో మాట్లాడి బాగా చదవాలని తెలిపారు. మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. నైట్ విజన్‌ను కొనసాగించాలని హెడ్మాస్టర్ ఆవుల శ్రీనివాసులుకు సూచించారు. డిప్యూటీ డీఈఓ వెంకట ఎంఈఓ పద్మలత ఉన్నారు.

అవినీతికి తావులేకుండా పథకాలు అందిస్తున్నాం

ఎంపీపీ వీరనారాయణరెడ్డి

బ్రహ్మంగారిమఠం : అర్హులందరికీ పథకాలు అందజేస్తామని, ఈ విషయంలో ఎటువంటి సందేహం అవసరం లేదని ఎంపీపీ సి. వీరనారాయణరెడ్డి తెలిపారు. సోమవారం మండల కేంద్రంలోని ఆయన కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ నేత రాజానాయుడుతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. భూ పంపిణీ కార్యక్రమంలో దరఖాస్తుదారుల నుంచి వసూళ్లు చేస్తున్నారని ఓ పచ్చ పత్రిక రాసిన కథనంపై ఘాటుగా స్పందించారు. నిరాధారమైన ఆరోపణలు చేస్తే చూస్తూ ఊరుకునేది లేదన్నారు. వసూళ్లు చేసినట్టు చూపించే దమ్ముందా అంటూ సదరు పత్రిక యాజమాన్యాన్ని ప్రశ్నించారు. టీడీపీ హయాంలో జరిగినవి ఇప్పుడు జరుగుతున్నట్టు రాయడాన్ని తప్పుబట్టారు.

దరఖాస్తుదారులు వీఆర్‌ఓలు తమ దరఖాస్తులను అందజేయాలని తెలిపారు. అవినీతికి తావులేకుండా అర్హులకు పథకాలు అందజేస్తామని స్పష్టం చేశారు. రేకలకుంట మాజీ ఎంపీటీసీ వెంకటయ్య, రాజోలి జగన్నాదరెడ్డి, సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.